క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి



స్టాపర్‌ను ప్రారంభిస్తున్న సీఐ ప్రసాదరావు

నరసన్నపేట: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నరసన్నపేట సీఐ బి.ప్రసాదరావు అన్నారు. స్థానిక సిటిజన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఓ బంగారం వర్తకుని సహకారంతో పోలాకి రోడ్డులోని జీసీ హోం వద్ద స్టాపర్‌ను ఏర్పాటు చేశారు. దీనిని సీఐ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మెయిన్ రోడ్డుతోపాటు పోలాకి రోడ్డులో కూడా దేశవానిపేట వరకు ట్రాఫిక్ బాగా పెరిగిందన్నారు. వాహనదారులు నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలను అదుపుచేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు పి.విశ్వేశ్వరరావు, పూర్ణారావు, మురళీధర్, రోణంకి కృష్ణంనాయుడు, మార్పు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



ప్రభుత్వ స్థలంలో పెట్టిన దుకాణాన్ని తొలగిస్తున్న సిబ్బంది

నరసన్నపేట: స్థానిక పాతబస్టాండ్ వద్ద మెయిన్ రోడ్డుకు ఆనుకుని ఉన్న మహిళా మార్ట్ పక్కన ఆక్రమణలను సోమవారం ఉదయం పంచాయతీ, మండల పరిషత్ సిబ్బంది సంయుక్తంగా తొలగించారు. రెండు రోజుల వ్యవధిలో మహిళా మార్ట్ పక్కన మండల పరిషత్ పాత షాపుల మధ్యన ఇద్దరు వ్యక్తులు రేకుల షెడ్, దుకాణం వేర్వేరుగా ఏర్పాటు చేశారు. ఈ సమాచారం తెలుసుకున్న పంచాయతీ ఈఓ చిన్నారావు, మండల పరిషత్ సిబ్బంది ప్రసాద్, వెంకటరావు వెళ్లి ఆక్రమణదారులకు నచ్చజెప్పి ప్రభుత్వ స్థలం ఆక్రమణలకు పాల్పడం మంచిది కాదని తీసివేయాలని సూచించారు. వారు మొండిగా వ్యవహరించడంతో సోమవారం ఉదయం పంచాయతీ సిబ్బంది సహకారంతో ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా ఈఓ చిన్నారావు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలు అక్రమణలకు పాల్పడం నేరమన్నారు. ఎవరు ఆక్రమణలకు పాల్పడినా ఇదే పద్ధతిన తొలగిస్తామని హెచ్చరించారు.

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవం



శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం పాంచరాత్రి ఉత్సవాల్లో భాగంగా జ్యేష్ఠమాసం సోమవారం లక్ష్మీనరసింహ స్వామి వారి కల్యాణ ఉత్సవం ఘనంగా జరిగింది. గణపతి పూజతో ప్రారంభించి స్వామికి ప్రత్యేక పూజలు, ఏకవార అభిషేకాలు నిర్వహించారు. దీనికి ముందు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం తిరువీధి నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ పి.ప్రభాకరరావు, పురోహితులు జనార్దన శర్మ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



సాయిగీత, వైద్యాధికారి

హిరమండలం: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హిరమండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సి.హెచ్.సాయిగీత అన్నారు. ఇంటి పరిసరాల్లో ఎక్కువ కాలం నీరునిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. నీరు ఉన్నచోట దోమలు ఉంటాయని, రాత్రి వేళల్లో దోమతెరలు వాడాలన్నారు. దోమకాటుతో చికెన్‌గున్యా, మలేరియా, టైఫాయిడ్, డెంగీ వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. జ్వరం, జలుబు, దగ్గు వస్తే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందాలన్నారు.

మట్టి తరలిస్తే కఠిన చర్యలు

నరసన్నపేట: చెరువుల్లో మట్టి తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని నరసన్నపేట తహసీల్దార్ కనకారావు హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం విలేకరులతో నరసన్నపేటలో మాట్లాడారు. గట్టు తవ్వినా చర్యలు తప్పవన్నారు. మండలంలో నరసన్నపేట, అంప్లాం తదితర చోట్ల చెరువుల్లో మట్టి తవ్వకాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే వాటిని నిలుపుదల చేశామన్నారు. అనుమతి లేకుండా మట్టి తరలిస్తే జేసీబీ, ట్రిప్పర్లతోపాటు ఏ వాహనాలున్నా సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇసుక అక్రమ తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

90 మందికి నేత్ర వైద్య పరీక్షలు



సారవకోట మండలంలోని అలుదు గ్రామంలో గల ప్రాథమిక పాఠశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 90 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. విజయాంబికా యువజన సంఘం ఆధ్వర్యంలో చల్ల జగయ్య, అమ్మన్నమ్మల జ్ఞాపకార్థం జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ ఫౌండేషన్ వైద్యులు హాజరై వైద్య పరీక్షలు నిర్వహించారు. 45 మందికి కంటి శస్త్ర చికిత్సలకు విశాఖపట్నం శంకర ఫౌండేషన్‌కు తరలించారు. విజయాంబికా యువజన సంఘం అధ్యక్షుడు చల్లా ఆనందరావు, మాజీ సర్పంచ్ కళింగపట్నం అప్పన్న తదితరులు పాల్గొన్నారు. - సారవకోట

ఘనంగా మందిర వార్షికోత్సవం



బూర్జ మండలంలోని కంట్లాం గ్రామం గల అభయాంజనేయ మందిర మొదటి వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు బైరి అనిల్‌కుమార్, బైరి పార్థసారధి ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక, కుంకుమ పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, చుట్టు పక్కల గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. - బూర్జ

కల్యాణం.. కమనీయం



నరసన్నపేట మండలం జమ్ము గ్రామంలో గల రామ మందిరం వార్షికోత్సవం సందర్భంగా సోమవారం సీతారాముల కల్యాణం, పట్టాభిషేక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ధర్మకర్త వాన గోవిందరావు దంపతుల ఆధ్వర్యంలో సత్యవరాగ్రహారం గ్రామానికి చెందిన మావుడూరు జగదీష్ బాబు కల్యాణం చేపట్టారు. వార్షికోత్సవం సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. - నరసన్నపేట

త్యాగానికి ప్రతీక బక్రీద్

- మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు
- శుభాకాంక్షలు తెలియజేసుకున్న ముస్లింలు

నరసన్నపేట: స్థానిక జమియా మసీదు ఆవరణలో ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని సోమవారం నిర్వహించారు. మత గురువు ఆరాఫత్ బక్రీద్ ప్రాధాన్యతను వవరించారు. త్యాగాలకు ప్రతీక బక్రీద్ అని అన్నారు. ముస్లింలు నిర్వహించే ప్రధాన పండగల్లో బక్రీద్ ఒకటని అన్నారు. త్యాగం వెనుక ప్రేమ ఉంటుంది, ప్రేమ వెనుక దైవం ఉంటుందన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నియోజకవర్గంలోని పరసర గ్రామాలకు చెందిన ముస్లీంలు, జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు షేక్ బాబ్జీ, ముస్లిం సంఘ ప్రతినిధులు ఎండీ మదీన్, ఎండీ అజ్జు, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.



పాతపట్నం: ప్రహరాజపాలెం మసీదులో పార్థనలు చేస్తున్న ముస్లింలు



నరసన్నపేట: జమియా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ప్రహరాజపాలెంలో..

పాతపట్నం: మండలంలోని ప్రహరాజపాలెంలో బక్రీద్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. మసీదులో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక నమాజ్‌లు చేశారు. అనంతరం బంధు, మిత్రులకు ఖీర్‌ను పంచిపెట్టారు. ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కొరసవాడకు చెందిన ముస్లింలు, మసీద్ గురువు మహమ్మద్ లుక్‌మాన్, షేక్ షాంధ్, ఫరీద్, ఫకీర్, హిబ్రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

కుండపోత..



చింతలబడవంజ వద్ద పొలాల్లో చేరిన వర్షంనీరు



ఎల్.ఎన్.పేట మండల కేంద్రంలో కురుస్తున్న వర్షం



తురకపేట సెంటర్‌లోని ఏబీ రోడ్డుపై నిలిచిన వర్షంనీరు

ఎల్.ఎన్.పేట: మండలంలోని అన్ని ప్రాంతాల్లోను సోమవారం కుండపోతగా వర్షం కురిసింది. పలు గ్రామాల్లో వరి వెదలు వేసేందుకు, ఇప్పటికే విత్తనాలు వేసుకున్న రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. పొలాల్లో నీరు చేరేలా వర్షం కురిస్తే రైతులకు మేలు జరుగుతుందని ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్న రైతులకు ఊరట ఇచ్చింది. తెల్లవారు జామునే మేఘాలు కమ్మేయటంతోపాటు ఉరుములు, మెరుపులతో కుండ పోతగా వర్షం కురిసింది. సుమారు గంట సమయం వర్షం కురవడంతో పొలాల్లో నీరు చేరింది. వర్షంతో ఎంతో మేలు జరుగుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేవారు. వర్షం కారణంగా మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

వీర వనిత ఝాన్సీ లక్ష్మీబాయి



ఝాన్సీలక్ష్మీబాయి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రామరాజు, పాఠశాల సిబ్బంది

పాతపట్నం: మండలంలోని ప్రహరాజపాలేంలో ఉన్న డాక్టర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఝాన్సీలక్ష్మీబాయి వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు.

పాఠశాల ఆవరణలో ఉన్న ఝాన్సీ లక్ష్మీబాయి విగ్రహానికి ట్రస్ట్ అధ్యక్షుడు పి.రామరాజు, వైస్ ప్రిన్సిపాల్ వి.అర్చన పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రముఖ పాత్ర వహించిన వీర వనిత ఝాన్సీలక్ష్మీబాయి అని కొనియాడారు. ఉపాధ్యాయులు వై.సునిత, ఎస్.రాధ, బి.భవాని, వి.కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ



అల్లెనలో వరి విత్తనాలు అందజేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

బూర్జ: మండలంలోని అల్లెన, గుత్తావల్లి గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో రాయితీపై వరి విత్తనాలను వ్యవసాయ శాఖ సిబ్బంది సోమవారం అందజేశారు. ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు ఏఓ వి.రాజేశ్వరరావు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఏఓ మాట్లాడుతూ మండలంలో మొత్తం 16 ఆర్‌బీకేల్లో సుమారు 346 క్వింటాళ్ల వరి విత్తనాలు, పచ్చిరొట్ట విత్తనాలు రావటం జరిగిందన్నారు. అవసరమైన రైతులు వరి విత్తనాలు రిజిస్టర్ చేయించుకుంటే అందజేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఖరీఫ్ 2024 సీజన్‌కు సంబంధించి ఎరువులు యూరియా 280, డీఏపీ 100 మెట్రిక్ టన్నులు ఆర్‌బీకేల వద్ద ముందస్తుగా నిల్వ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు, ఆర్బీకేల సిబ్బంది పాల్గొన్నారు.

పూడిక తొలగించండి



కాలువలో మట్టి ఉన్న దృశ్యం

సారవకోట: మండల కేంద్రంలోని జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న రంగసాగరం కాలువలో పూడికలు తొలగించాలని రైతులు కోరుతున్నారు. రంగసాగరం కాలువ నుంచి పంట పొలాలకు వెళ్లే కాలువకు సమీపంలో ఇటీవల పైపులైన్లు వేసేందుకు రోడ్డుకు ఒక పక్క తవ్వకం చేపట్టారు. ఆ పనుల్లో భాగంగా ఈ కాలువకు నీరు వెళ్లేచోట మట్టిని వేసేశారు. రానున్న వర్షాకాలంలో ఈ కాలువ నీరు పొలాలకు వెళ్తుంది. ప్రస్తుతం మట్టి కప్పడంతో నీరు వెళ్లేందుకు ఇబ్బంది కలుగుతుందన్నారు. పూడికలు తొలగించాలని కోరుతున్నారు.

కల్యాణ వైభోగం



కల్యాణ వేడుకల్లో భక్తజనం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం నగరంలోని చిన్నబజారు దూదివారి వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు రేజేటి వెంకట శ్రీనివాసాచార్యులు నేతృత్వంలో భూదేవి, శ్రీదేవి సమేతంగా వేంకటేశ్వరుని ఉత్సవ మూర్తులను వేదికపై ఉంచి సంప్రదాయంగా కల్యాణ వేడుకలు నిర్వహించారు. ఈ అపూర్వ ఘట్టాన్ని భక్తులు ఆసక్తిగా తిలకించారు.

బాలాజీ ఆలయంలో పూజలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బ్యాంకర్స్ కాలనీలో ఉన్న శివబాలాజీ ఆలయం వార్షికోత్సవంలో భాగంగా సోమవారం కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అర్చకులు గోపినంబాళ్ల సీతారామాచార్యులు, సత్య కూర్మాచార్యుల నేతృత్వంలొ భూదేవి, శ్రీదేవి సమేతంగా వేంకటేశ్వరుని ఉత్సవ మూర్తులను వేదికపై ఉంచి కన్యాదానం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణను సంప్రదాయంగా నిర్వహించారు. ఐదువేల మందికి ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు తులసీరావు, సామంత్ పాల్గొన్నారు.

పలు ఆలయాలలో కల్యాణ వేడుకలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలు ఆలయాలలో జేష్ట శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామివార్లకు కల్యాణ వేడుకలు జరిగాయి. మొండేటివీధిలోని లలితా సమేత శివకామేశ్వర స్వామి ఆలయం వార్షికోత్సవంలో భాగంగా కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు, షిర్డీసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో శివ పార్వతుల ఉత్సవ మూర్తులను వేదికపై ఉంచి కల్యాణ వేడుకలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.



రమ్యాతిరుమలలో కల్యాణ వేడుకలు

ఉత్తరేశ్వరునికి కల్యాణం

బలగ ఉత్తరేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి కల్యాణ వేడుకలు నిర్వహించారు. ముందుగా ఉత్సవ మూర్తులను నగరంలో ఊరేగించారు. అనంతరం ఉత్సవమూర్తులను వేదికపై ఉంచి సంప్రదాయబద్ధంగా కల్యాణాన్ని జరిపించారు.

రమ్యాతిరుమలలో..

అరసవల్లి రోడ్డులోని రమ్యాతిరుమలలో వేంకటేశ్వరుని కల్యాణ వేడుకలు జరిగాయి. ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి అర్చకులు కరి రంగనాథ వేణు మాధవాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణ ఉత్సవాలు నిర్వహించారు. చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వరస్వామి దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా సంప్రదాయ గురుకులం ఫ్యాకల్టీ లలీ కృష్ణ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన జరిగింది. నృత్య బృందాన్ని ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. ఆలయ ఈవో మాధవి పాల్గొన్నారు.



నృత్య కళాకారులకు సత్కారం

ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తు పెంపు



జుబ్లీ రోడ్డులో ఎత్తు పెంచిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పాతపట్నం: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలోని జుబ్లీ రోడ్డులో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకంగా ఉండేది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, ఫ్యూజు బాక్సులు తక్కువ ఎత్తులో ఉండేవి. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చేవారు, ప్రైవేట్ స్కూళ్లకు చెందిన విద్యార్థులు నిత్యం ఈ పక్క నుంచే రాకపోకలు సాగించేవారు. సోమవారం విద్యుత్ శాఖ డీఈఈ ప్రసాదరావు ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎత్తును పెంచి ఫీజు బాక్‌ను ఏర్పాటు చేశారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సందడిగా మోహిని భద్రాంబికా ఉత్సవం



సెగిడిపేట గ్రామస్తుల కోలాటం

గార: మేజర్ పంచాయతీ శ్రీకూర్మం గ్రామదేవత మోహిని భద్రాంభికా గ్రామదేవత ఉత్సవం సందడిగా జరిగింది. సోమవారం సాయంత్రం గ్రామంలో పులి వేషాలు, పెళ్లి సెట్టింగ్, ట్రాక్టర్‌పై హరిశ్చంద్ర నాటకం ప్రదర్శన, యువత డాన్సులు ఆకట్టుకున్నాయి. కామదహన మంటపం వద్ద జెయింట్ వీల్, చిన్నారులు ఆడుకునేందుకు పలు యంత్రాలు ఏర్పాటు చేశారు.

స్థానిక సెగిడిపేట గ్రామస్తుల కోలాటం అందరినీ ఆకట్టుకుంది. మంగళవారం సాయంత్రం అనుపు ఉత్సవం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.



కామదహన మంటపం వద్ద ఎగ్జిబిషన్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నరసన్నపేట: మేజరు పంచాయతీ నరసన్నపేట పరిధిలోని పలు వీధుల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ కోటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పప్పల వీధి, మార్కెట్, జోగిపేట, మఠంవీధి, బైరీ వీధుల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 వరకు విద్యుత్ ఉండదన్నారు. ఈ వీధుల్లో శిథిల విద్యుత్ స్తంభాలకు వైర్లు మార్చాల్సి ఉందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

వేతన బకాయిలు చెల్లించాలి

కొత్తూరు: ఉపాధి పథకం వేతనదారులకు ఐదు నెలలు బకాయిపడిన వేతనాలను తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. కొత్తూరులో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఐదు నెలల నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో వేతనదారుల కుటుంబాలు పస్తులు ఉండావల్సిన దుస్థితి నెలకొందన్నారు. వేతనదారులకు 150 రోజులు పనులు కల్పించాలన్నారు. ప్రతీ వేతనదారుడుకి పని కల్పించాలని అధికారులను కోరారు.